# సర్వరోగ నివారిణి

(గల్పిక)

అతణ్ణి అపరాధన్వంతరి అన్నారు. అతను సర్వరోగనివారిణి కనిపెట్టి, దానితో అన్నిరోగాలూ నయంచేస్తూ, ఇతర వైద్యులనోట మట్టిగొట్టటమేగాక, బాగా డబ్బుకూడా సంపాదించాడు.

సర్వరోగనివారిణి తయారుచెయ్యడానికి కావలసినది నాలుగే నాలుగు దినుసులు. అందులో రెండు మూలికలు. ఔషధ రహస్యం మరొకడికి తెలియటం ఇష్టంలేక అతను తానే శ్రమపడి ఓషధులను రహస్యంగా ఏరి తెచ్చి, మందు రహస్యంగా తయారు చేసేవాడు. ఇది శ్రమతో కూడిన పని.

పేదవాడుగా ఉన్నప్పుడు ఉత్సాహంగా శ్రమపడినవాడు, డబ్బు పోగవు తున్నకొద్దీ శ్రమ అంటే విముఖత తెచ్చుకున్నాడు. మరి ఏంచెయ్యాలి ? సర్వరోగనివారిణి ధర పెంచాడు. సగం మందు అమ్మినా పాతరాబడికన్న ఎక్కువ వస్తున్నది. కాని సగం శ్రమపడక తప్పటంలేదు.

ఏంచెయ్యాలి ? తన మందును తనే కల్తీచేసి, ఓషధులకు బదులు ఇంకేవో తేలిగ్గా దొరికే ఆకులు వాడాడు. సర్వరోగనివారిణి రాను రాను జలుబును కూడా నయంచెయ్యలేని పరిస్థితికి వచ్చింది.

దానికి గిరాకీ తగ్గింది. అతడికి రాబడి తగ్గింది. పాతసంపాదనమీద బతికినన్నాళ్ళూ దర్జాగా బతికి, చిల్లిగవ్వ మిగల్చకుండా చచ్చాడు.

సర్వరోగనివారిణి ఎలా తయారుచేయాలో ఎవరికీ తెలీదు. అదే అతను మానవజాతికి చేసిన ద్రోహం.

---

**కొడవటిగంటి కుటుంబరావు**

# తోలు బొమ్మలు

(గల్పిక)

దిబ్బ రాజ్యం అధోగతిలో ఉండగా అక్కడికి తోలుబొమ్మలాట మొదటి సారిగా వచ్చింది. అది దిబ్బ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించవలసిన రోజు. అంతకుపూర్వం దిబ్బలో అన్ని కళలూ ఉన్నాయి, కాని పరిశ్రమలు లేక కళలు గుంటపూలు పూసాయి. తిండిలేక జనం ఎడా పెడా చచ్చారు. దేశంలో అరాజకం ఏర్పడింది.

తోలుబొమ్మలు జనాన్ని ఆకర్షించాయి. వాళ్ళు ఆకలి దప్పులు మరిచారు. తోలుబొమ్మలు ఒక మహత్తర సాంస్కృతికోద్యమమూ, అంతకన్న మహత్తర పరిశ్రమా అయి కూర్చున్నది.

కవులు కొత్త తోలుబొమ్మలాటలు రాసారు. గాయకులు తోలుపాటలు పాడారు. కళాకారులు రంగాలంకరణ చేశారు. నేపథ్య తోలునటులకు ఇంతా అంతా అని చెప్పటానికి వీల్లేని ఖ్యాతి వచ్చింది. తోలుపరిశ్రమలో లక్ష్మి తాండవించింది. బావులూ, చెరువులూ తవ్వించటానికి ఎర్రఏగానీ చందా ఇయ్యనివాళ్ళు, తోలుపరిశ్రమలో లక్షలు పెట్టుబడి చేసారు. తోలుకళాకారులు మంత్రులను మించి సంపాదించారు

తోలు సంస్కృతిని అధికారరీత్యా గుర్తించక తప్పలేదు. తోలునటులకూ, కవులకూ, కళాకారులకూ, గాయకులకూ "రాజపూజిత", "రాజోపచార", "తోలు కళాసార్వభౌమ" వగైరా బిరుదనామాలూ అవీ ఏర్పాటయాయి.

తోలుపరిశ్రమకు సంబంధించిన స్త్రీలూ, పురుషులూ దిబ్బసంస్కృతికి మహా లావాటి పట్టుకొమ్మలై, సాంస్కృతిక సప్తాహాలూ, దశాహాలూ జరిగి నప్పుడు పెత్తనంచేశారు.

దిబ్బలో అరాజకంపోయి ప్రజాస్వామ్యం అవతరించింది.

*కొడవటిగంటి కుటుంబరావు*